# చిరుదీపం

స్కూలు దాటి గుండెనిండా గాలి పీల్చుకున్నాడు చిరంజీవి. మొహానికి పట్టిన చెమటను రుమాలతో అద్దుకున్నాడు. రుమాలు లోపలికి దోపుకుంటూ జీతంరాళ్ళు ఉన్నాయో లేవో ఓసారి తనిఖీ చేసుకున్నాడు.

చిన్న దరహాసం అతని వదనంలో వెల్లివిరిసింది.

జీతం!

చెప్పుకుంటే సిగ్గు చేటు-

నాలుగు వందలు!

ఓ బస్తా బియ్యం కూడా కొనలేని నెల జీతం!

జీవితానికీ, జీతానికీ, జాతకానికీ జరుగుతున్న అనుభవాలకు సంబంధం ఉంది.

గొర్రెకు తన జీతాన్ని చూపిస్తే నా తోక పెద్దదని ఎగతాళి చేస్తుంది.

చిరంజీవికి ఈరోజు కాదు యాసిరి కొచ్చింది. ప్రతి జీతం రోజూ జీవితం మరింత భారం అవుతుంది.

కంఠం దాచుకోకుండా-ఒళ్ళువంచి, మెదడుకు పదును బెట్టి పిల్లలకు నాలుగు అక్షరం ముక్కలు చెప్పి, తన నోట్లోకి నాలుగు వేళ్ళు పోనిచ్చుకుంటాడు చిరంజీవి. ప్రస్తుతం ఆ సంపాదనతో చిరంజీవి చిరుజీవి అయిపోయాడు.

అతని గ్రామంలో తమ అబ్బాయి గురించి గొప్పగా చెప్పుకుంటారు అతని తల్లిదండ్రులు-పట్నంలో పెద్ద పదవి వెలగబెడుతున్నాడని.

కాని వాస్తవానికి గతి లేక గంజి మెతుకులు తిందామని ఇష్టం లేకున్నా కష్టంగా ఉన్నా, నష్టానికైనా ఒప్పుకొని అదే చిరుద్యోగం అఘోరిస్తున్నాడు.

జీవికి నవ్వొచ్చింది.

ఆ చిరు ఉద్యోగానికి తను ఎన్ని పాట్లు పడ్డాడు!. ఎందరితో సిఫార్సు చేయించుకున్నాడు!అదో ఫార్సుగా మారింది తనకు.

ఆశ! పట్నంలో ఉంటే ఇంకా పెద్ద ఉద్యోగం దొరుకుతున్నదన్న ఆశ. చదువుకు తగ్గ ఉద్యోగం! ప్రతిభకు పట్టం.

గది తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి. బహుశా, ఎవడో ఒకడు ముందు వచ్చి ఉండాలి.

"హలో చిరూ! వెల్‌కమ్! కాఫీలో షేర్ చేస్తావా?" రవి అడిగాడు పెదాలకు ఆనించుతున్న గ్లాసును వెనక్కు తీసుకుంటూ.

"ప్లీజ్! నన్ను చిరు, అని పిలవద్దు- పిలిస్తే చిరంజీవి అను, లేకపోతే జీవి అను- అంతే!" కోపంగా అన్నాడు.

"అబ్బే జీవి ఏమిట్రా నీ మొహం! దానికంటే చిరు చాలా ముద్దుగా ఉంది."

"చూడు బ్రదర్! అసలే నాది చిరుద్యోగం- నువ్వు నన్ను 'చిరూ, చిరూ' అని పిల్చి చిరుద్యోగం లోనే సెటిల్ చేస్తావా?"

"అదా నీ చిర్రుబుర్రుకు కారణం? అయినా రాసిపెట్టి ఉండాలి కాని మనం అన్నామని ఉద్యోగా లొస్తాయా?"

"ఎవడ్రా ఆ రాసేది? నా దగ్గరకు రమ్మను- ఇంత వెధవ రాత ఎందుకు రాశాడో సంజాయిషీ అడుగుతాను. వేలకు వేలు తగలేసి, ఎకరాలకు ఎకరాలు అమ్మి, నా తల్లిదండ్రులు నన్ను ఎమ్మెస్సీ, బి.ఇడిని చేశార్రా. ఇంత ఖర్చు పెట్టి నే వెలగబెట్టిందేమిట్రా? ఆఫ్టరాల్ ఓ ముష్టి నాలుగొందల ఉద్యోగం" ఆవేశపడ్డాడు.

"ఇలా అని వాళ్ళు కల కంటే ఆ అమ్మేసే పొలాల్లోకే నిన్ను తోలేవాళ్లురా, వ్యవసాయం చేసుకుని నలుగురికి సాయపడమని"

"మా నాయన మొత్తుకుంటూనే ఉన్నాడు- నేల తల్లిని నమ్ముకోరా అని. కాని బుద్ధి గడ్డి తిని ఏదో చేద్దామని- ఈ దేశాన్ని బాగుచేద్దామని చదువుకుని ఇలా చెడిపోయాను"

"చిరూ! ఇదే అమెరికాలో అయితే-నీ లాంటి తెలివిగలవాణ్ణి ఇలా బతకనివ్వర్రా!"

"ఏరా? చంపేస్తారా?"

"కాదురా! నెత్తిన పెట్టుకుని పూజిస్తార్రా. చదువుకు విలువలేని దేశం మనదేరా. బై దిబై సిన్మా కొస్తావా?

"నా దగ్గర డబ్బుల్లేవు" ముక్తసరిగా చెప్పాడు.

"జీతం రాలేదా?"

"ఆఁ! వచ్చింది."

"మరి?"

"దేని కని చాల్తుంది? మెస్సు బిల్లివ్వాలి, ఇంటి అద్దె కట్టాలి, బట్టల కొట్లో ఇవ్వాలి, ఇంకా మైనస్సే"-

"ప్చ్! లోటు బడ్జెటు అన్నమాట!"

"అందుకే- ను వెళ్ళు రవీ."

"నీ ఖర్చు భరిస్తా రారా నెలలో ఒక్క రోజన్నా ఆనందంగా గడపకపోతే మనిషి ఏమైపోతాడురా? కష్టాలున్నప్పుడు ఏం చెయ్యాలో తెల్సా? రాబోయే సుఖాన్ని ఊహించుకుంటూ బతికెయ్యాలి."

"ఊహకు కూడా ఒక ఆధారం కావాలి. ఆ ఆధారం కూడా లేకపోతే?"

"అంతా అనుకోవడంలో ఉంది బ్రదర్! శూన్యంలోంచి సృష్టి చెయ్యడం లేదా? మన రచయితలు. నీ బుర్ర అంతే! తీయటి కలలు కనేసెయ్యి."

"సారీ! నే నేం నేత పనివాడినా- నెయ్యడానికి? మాతృమూర్తినా కనడానికి?" వాతావరణం తేలిక చేస్తూ చిరంజీవి నవ్వడానికి ప్రయత్నించాడు.

"నీకో సంగతి తెల్సా? నవ్వు నాలుగు విధాలా ఆరోగ్యానికి మంచిది. విషాదం తప్పని సరైనప్పుడు జీవితంలోని హాస్య సంఘటల్ని నెమరువేసుకుని నవ్వడం ఆరోగ్యానికి ఔషధం"!

"ఎదుటివాడికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి."

"నో ఆర్గుమెంట్సు సిన్మాకు టైమయింది. తొందరగా తెములు. ఆలసించిన ఆశాభంగం".

మరి- అర్జున్?"

"వాడా? ఎప్పుడొస్తాడో ఆ దేవుడికే తెలియాలి."

ఓ గంట తర్వాత మిత్ర ద్వయం ఆ సిన్మాహాలు దగ్గరికి వచ్చారు.

దేశంలో పని లేని వాళ్ళంతా అక్కడే గుమిగూడినట్లున్నారు. ఇసకేస్తే రాలని జనం!

చదువుకుని సంస్కారవంతులమని విర్రవీగే సగటు ప్రజ టికెట్ల కోసం కుక్కల్లా

కొట్లాడుకుంటున్నారు. బుకింగ్ తెరవగానే ఒక్కసారి బెల్లంచూట్టూతేరిన ఈగల్లా గుంపుగూడారు. ఒకళ్ళని ఒకళ్ళు తోసుకుంటూ చొక్కాలు చింపుకుంటూ బుకింగ్ ముందు యుద్ధం చేస్తున్నారు.

అప్పటిదాకా చాయ్ తాగుతున్న పోలీసు కానిస్టేబుల్ విజిలేసుకుంటూ, లాఠీని ఊపుకుంటూ పరుగెత్తుకుంటూ వచ్చాడు. లాఠీని నేలకి తాటించాడు. అందర్నీ ఒక లైనులో సర్దాడు.

ఆ సర్దుడులో రవి, చిరంజీవి హనుమంతుడి తోకలా ఉన్న క్యూలో చివరికి చేరుకున్నారు.

"ఏరా! టికెట్లు దొరుకుతాయంటావా?" రవి అడిగాడు.

"నాకు నమ్మకం లేదు" చిరంజీవి చప్పరించాడు.

"ఎలారా?" అదేదో అంతర్జాతీయ సమస్యలా ఆందోళన వ్యక్తపరిచాడు రవి.

అతని మొహంలో తాండవిస్తున్న అందోళన అతని ఒంట్లోని కంగారు చిరంజీవికి నవ్వు తెప్పించాయి. ఈ సినిమా ఈ రోజే చూడకపోతే నిజాని కొంపలంటుకోవు. ఆ హీరో, హీరోయిన్లు ఇద్దరూ రవికి ప్రత్యక్ష దైవాలు. అదీ అతని బాధ! అందుకే కంపెనీ కోసం ఖర్చు భరిస్తున్నాడు.

"రవీ! నువ్విలాగే క్యూలో ఉండు నేను మళ్ళీ వస్తా."

"ఎక్కడికి? మనిషికి ఒకటే టికెట్టు."

"రాజకీయాల్లోనే రెండు, మూడు ఇస్తున్నారు. వీడెవడ్రా? ఇస్తాడులే. అయినా నీ దాకా వచ్చినప్పుడు సంగతి - ఈ లోపు బ్లాకులో బుక్ అయిపోయి ఉంటాయి."

"సరే, తొందరగా వచ్చెయ్యి."

చిరంజీవి క్యూ లోంచి బయటకు వచ్చి లేడీస్‌కు టిక్కెట్లు ఇచ్చే వైపుకు వచ్చాడు. అక్కడా క్యూ పెద్దదిగానే ఉంది కాని భయపడాల్సినంత కాదు. ఎవరైనా తెలిసిన వాళ్ళు కనిపిస్తారేమోనని చూశాడు.

అంతే!

అతని కళ్ళు చెదిరాయి.

ఆమె! ఆమె!

నంద! సునంద!

ఆనందంతో గంతులేసింది మనసు.

చిరంజీవి క్యూలో మెరిసిపోతున్న పసుప్పచ్చ చీర కట్టుకున్న ఆ చుక్క వంక చూశాడు.

తన కళ్ళు తన్ని మోసం చెయ్యలేవు. ఆమె నందే. అవును ఆ ముందున్నది ఆమె అక్క సుమతి. అతని మతి గతి తప్పింది.

వేగంగా అడుగు లేసుకుంటూ వాళ్ళిద్దరి పక్కకూ వచ్చి నిలబడ్డాడు.

క్యూ కదులుతున్నది. వాళ్ళు కదులుతున్నారు.

వెనుకనున్న స్త్రీలు కొందరు ఇబ్బందిగా చిరంజీవిని చూశారు. కొందరు ఆనందంగా అతన్ని గమనిస్తున్నారు.

కాని నంద, సుమతులు మటుకు చూడ్డంలేదు.

"ఎక్స్‌క్యూజ్ మీ", దగ్గాడు.

వాళ్ళిద్దరిలో స్పందన కలగలేదు. బుకింగ్ కౌంటర్‌ను ఏకాగ్రతతో గమనిస్తూ ముందుకు కదులుతున్నారు.

"రెండు టికెట్లు తెచ్చిస్తారా?" తడారిపోతున్న గొంతుతో అడిగాడు.

దేవతలు కరుణించలేదు.

అందగత్తె ననుకుని మందంగా మేకప్ చేసుకున్న ఓ మానిని చెయ్యి చాపింది డబ్బులిమ్మని.

చిరంజీవికి ఆ క్షణంలో ఏం చెయ్యాలో తోచలేదు. అతని చేతిలోని నోటును ఆమె గుంజుకుంది తన చేతి వేళ్లని అతని చేతి వేళ్లకు తగిలిస్తూ తర్వాత ఆమె మెలికలు తిరిగింది నోటును జాగ్రత్తగా ముడుచుకుంటూ.

ఇనప కడ్డీలు అడ్డు రావడంతో చిరంజీవి ఆగిపోయాడు. వాళ్ళు ముందు కెళ్ళిపోయారు.

తను ఎందుకు పేరుపెట్టి పిలవలేకపోయాడు? తన కళ్ళు తన మనసు అబద్ధం చెప్పవు. ఆమె సునందే! ఆ కోల మొహం, చెంపకు చారడేసి కళ్ళు, ఆ కోటేరు ముక్కు, ఆ పసిడి ఛాయ, మరీ పొడుగు పొట్టీ కాని నిండైన విగ్రహం అంతా ఆమే! సందేహంలేదు.

"ఏయ్! మిస్టర్! మీ టికెట్లు!" అందగత్తె టికెట్లు అతని కళ్ళ ముందు ఆడించింది. "నిల్చునే నిద్రపోతున్నారు."

"థాంక్యూ సిస్టర్!" ఆ టికెట్లు అందుకున్నాడు.

ఆమె మూతి ముడుచుకుని వెళ్ళిపోయింది.

ఆ జనంలో నంద ఎక్కడ మాయమైందో కనుక్కోలేకపోయాడు.

ఇంతలో రవి - అతన్ని వెతుక్కుంటూ వచ్చాడు.

"చిరూ! నీ కోసం హాలంతా గాలిస్తున్నా. టికెట్లు దొరకలేదు. బ్లాకులో ట్రై చేద్దామా?"

"దొరికాయి. తీసుకో" జేబులోంచి టికెట్లు తీసి ఇచ్చాడు.

"హుర్రే!" అంటూ కౌగిలించుకున్నంత పని చేశాడు.

వాళ్ళు హాల్లోకి ప్రవేశించే ముందే సినిమా ప్రారంభమవడం వల్ల లైట్లు ఆఫ్ చేశారు.

చీకట్లో కళ్ళు పొడుచుకున్నా నందా కనిపించలేదు. రవి ఉషారుగా వ్యాఖ్యలు చేస్తూ చప్పట్లు కొడుతూ సినిమా చూస్తున్నాడు. కాని చిరంజీవి మనసు మరో మనసు కోసం అన్వేషిస్తూ గతంలోకి వెళ్ళిపోయింది.

— ---- .....

పదో క్లాసు -

క్వార్టర్లీ ఎగ్జామ్స్ జరిగాయి. ఆ రోజు టీచర్లు పేపర్లు దిద్ది మార్కులు చెబుతున్నారు.

లెక్కల పీరియడ్‌లో సత్యం మాస్టారు మార్కులు చదివి పేపర్లు అందిస్తున్నారు పేర్లు పిలిచి.

"చిరంజీవి - మార్కులు ఊహించగలరా ఎన్నో" సత్యంగారు కళ్ళద్దాలు తుడుచుకుంటూ క్లాసు కలయచూస్తూ అడిగాడు.

క్లాసు మౌనంగా ఉండిపోయింది.

"సెవెంటీ" ఎవరో చిన్నగా అన్నారు లేడీస్ బెంచీల నుండి.

అప్పటిదాకా వచ్చిన హయ్యస్ట్ మార్క్ ఎయిటీ.

"కాదు - నూట ఇరవై!" సత్యం మాస్టారు చెప్పారు.

"ఆ!" నోరెళ్ళబెట్టారు చాలామంది.

"అవును మాగ్జిమమ్ నూరు మార్కులే! కాని ఛాయిస్ వదలకుండా అన్ని లెక్కలూ చేసి చిరంజీవి నూటికి నూట ఇరవై మార్కులు సంపాదించాడు. "చిరంజీవి! పేపరు తీసుకో."

సిగ్గుపడుతూ చిరంజీవి పేపరందుకుని బెంచీల మధ్య నడుచుకుంటూ చివరి బెంచీలోని తన స్థానానికి నడుచుకుంటూ వెళుతున్నాడు.

"కంగ్రాట్స్!" సన్నగా వినిపించింది ఆడవాళ్లవైపు నుండి.

చిరంజీవి అటు చూశాడు.

ఆమె అతని వంక కన్నార్పకుండా చూస్తున్నది.

"థాంక్స్" చెప్పాలని కూడా తోచక చిరునవ్వు నవ్వి వెళ్లి తన బెంచీలో కూర్చున్నాడు.

ఆ సంఘటన అంతటితో అయిపోతే అతను మరిచిపోయేవాడు. కాని -

బెల్లు కొట్టిం తర్వాత అందరూ వెళ్లిపోయారు.

చిరంజీవి సర్దుకుంటూ ఇంకొంచెం సేపు కూర్చున్నాడు. గాజుల గలగలకు తలెత్తి చూశాడు.

ఆమె! నవ్వుతూ నిలబడింది అతని ఎదురుగా.

"లెక్కల్లో ఫస్టు మార్కు కొట్టేశారు."

"ఏదో- ఫ్లూక్! మీ కెన్ని వచ్చాయి?"

"నే సెకండ్! ఎనభై వచ్చాయి."

"కంగ్రాచ్యులేషన్స్"

"ఎందుకు-ఎనభైకా?"

"కాదు. సెకండ్ వచ్చినందుకు."

"అక్కరలేదు. ఫస్ట్ రానిదానికి రిగ్రెట్స్ చెప్పండి."

"నెక్స్ టైమ్ బెటర్ లక్."

"మీ మమ్మీ, డాడీ బాగా చదువుకున్నవాళ్లా? రోజూ వాళ్లు మీకు లెక్కలు నేర్పిస్తారా?" ఆమె అమాయకంగా అడిగింది అతన్ని.

అతనికి ఫక్కున నవ్వు వచ్చింది.

"ఎందుకు నవ్వుతున్నారు?"

"మరి మా అమ్మా నాన్నలకు చదువే రాదు. మా తాత బడికే వెళ్ల లేదు."

"బాప్‌రే!" ఆశ్చర్యంతో ఆమె కళ్లు మరింత పెద్దవయ్యాయి. నమ్మలేనట్లుగా చూసింది. అతను ఆమె వంక మరింత ఆశ్చర్యంగా చూశాడు.

"ఏ గైడ్లు ఫాలో అవుతున్నారు?"

"గైడ్లా? ఉంటాయా లెక్కలకు?"

"కొనలేదా?"

"ఇంత వరకు చూడలేదు."

"మరి మార్కులు?"

"టెక్స్ట్‌బుక్ ఫాలో అవుతాను జాగ్రత్తగా."

'మీరు జీనియస్!"

అలా సునంద అతని జీవితంలోకి చొరబడింది. తనకు అర్థం కాని లెక్కలు చెప్పించుకోవడానికి వాళ్లింటికి వచ్చేది. ఒకే కులస్తులు కావడం మూలంగా వాళ్లింట్లో వాళ్లు అంత ఇబ్బందిగా ఫీలయ్యేవాళ్లూ కాదు.

సునంద తండ్రి ఇంజనీర్. ట్రాన్స్‌ఫర్‌పైన ఆ ఊరికి వచ్చాడు. అందుకే కొత్తగా ఆమె ఆ ఊళ్ళోని బడిలో చేరింది. సాధారణంగా కలివిడిగా ఉండడు చిరంజీవి. తన చదువు, తన ప్రపంచం తప్ప ఇంకేం పట్టించుకోడు. బాగా చదువుకుని దేశాన్ని ఉద్ధరించాలని అతనికి బాగా పట్టుదలగా ఉండేది.

ఆ రోజు టెన్త్ క్లాస్ చివరి ఎగ్జామ్ అయిపోయింది. సునంద దిగులుగా చిరంజీవి ఇంటి కొచ్చింది.

"మా నాన్నగారికి ట్రాన్స్‌ఫరైంది."

"ఏ ఊరికి?" "వైజాగ్ చెప్పింది".

"ఆ! వైజాగ్ చాలా బావుంటుంది." చెప్పాడు.

"అంతేనా? నీకే బాధ లేదా?"

"అఫ్‌కోర్స్ హైదరాబాద్ ట్రాన్స్‌ఫరైతే ఇంకా బాగుండేది. చార్మినార్ ఉండేది."

"యూ ఫూల్! అంతేనా నీ మనసు?"

"విజయవాడైనా పరవాలేదు."

"స్టూపిట్! ఇంక మనం కలుసుకోం."

"అదేం?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మా నాన్నగారితో అందరం వెళ్ళిపోతున్నాం కాబట్టి" సీరియస్‌గా చెప్పింది.

"కొంచెం కష్టమే. రేపటి నుండి నా దగ్గర లెక్కలు ఎవరు నేర్చుకుంటారు!" సిన్సియర్‌గా బాధపడ్డాడు.

'నీ జీవితాశయం లెక్కలు నేర్పడమేనా?" కోపంగా అడిగింది.

"కాదు. సైంటిస్ట్ కావడం. వీలైతే నాకు తెలిసిన విజ్ఞానాన్ని పంచి ఇవ్వడం" మెరిసే కళ్ళతో చెప్పాడు.

"అంటే, పెళ్ళీ గిళ్ళీ వద్దా?"

"ఏమో ఇంకా ఆలోచించలేదు."

"మరే మాలోచించావు?"

"ఇంటర్‌లో ఎంపీసీ గ్రూపు తీసుకుందామని."

"ఇంటర్‌లో ఎలాగూ చదువుతావులే. అదికాదు. జీవితం గురించి" నంద బాధగా అతని కళ్ళలోకి గుచ్చి

చూస్తూ అడిగింది.

"నందా! ఇవ్వాళ ఎందుకిలా కొత్త కొత్త ప్రశ్నలు అడుగుతున్నావు? రాత్రల్లా మేలుకుని చదివావా?" వింతగా చూస్తూ అడిగాడు.

"లేదు తండ్రీ! మనం కలుసుకునే ఆఖరు రోజు ఇది. అందుకుని."

"ఎందుకలా అనుకుంటున్నావు?"

"ఈ ఊరు వదిలి వెళ్ళిపోయిం తర్వాత నే నెక్కడుంటానో, ను వ్వెక్కడుంటావో?"

"బాగుంది! నువ్వేం విదేశాలకు వెళ్ళడం లేదుగా. ఆంధ్రలోనే ఇంకో చోట ఉంటావు. కలుసుకోక పోం." అభయమిస్తున్నట్లుగా చెప్పాడు.

గబుక్కున అతని చెయ్యిని పట్టుకుని ఆమె తన పెదాలకు ఆనించుకుంది.

ఆ మలి వెచ్చని వేడికి కొంచెం చలించాడు చిరంజీవి.

"నన్ను మర్చిపోవు కదూ?" తడి కళ్ళతో అడిగింది నంద.

"లేదు నాకు జ్ఞాపక శక్తి చాలా ఎక్కువ. ఏ సూత్రమైనా అడుగు చెప్పేస్తాను."

"నాక్కావలసిన సూత్రం వేరు. అది నీ దగ్గర లేదు".

"నా కన్ని సూత్రాలూ వచ్చు" బింకంగా అన్నాడు.

"పోనీ, కనీసం లెక్కల స్నేహితురాలిగా నన్ను గుర్తు పెట్టుకో నేస్తం!" గాద్గదిక స్వరంతో అంది.

"ఓ! తప్పకుండా" చెప్పాడు చిరంజీవి.

"రేయ్! లేవరా! అందరూ వెళ్లిపోయారు."

కళ్ళు తెరిచి చూశాడు. రవి భుజాలు కుదుపుతున్నప్పుడు,

"ఇంటర్వెల్ వచ్చిందా?"

"నీ మొహం! సినిమా అయిపోయింది. ఇంటర్వెల్‌లో లేపి లేపీ నా తల ప్రాణం తోకకొచ్చింది."

చెంగున లేచి కూర్చున్నాడు - నంద !

చిరంజీవి రాకెట్‌లా బయటకు పరుగెత్తాడు.

రవికి విషయం అర్థంగాక కంగారుపడ్డాడు. రిలాక్సింగుగా ఉన్నవాడు ఇలా మిల్కాసింగులా ఎందుకు పరుగెడుతున్నాడు చెప్మా అని జుట్టు పీక్కుంటూ వెంటపడ్డాడు.

చిరంజీవి అందరి తిట్లనీ దీవెనలుగా భావించి, అడ్డమొచ్చిన వాళ్లని తోసుకుంటూ, వీలైతే తొక్కుకుంటూ బయటకు దూసుకొచ్చాడు.

అప్పుడే మగవాళ్ళు వెళ్లిపోవడంతో ఆడవాళ్ళు బయటికొస్తున్నారు.

ఇంతలో మెరుపు మెరిసింది. సునంద, సుమతీ సమేతంగా వస్తున్నది.

ఎదురు వెళ్లి"ఏమండీ!" అని పిలిచాడు.

"మాకు ఆటో వద్దు" చెప్పింది సుమతి.

"రిక్షానా? ఈశ్వర్ నగర్ వస్తావా?" అడిగింది సునంద.

ఆ క్షణంలో చిరంజీవికి భూ మాత ఎందుకు తనని కనికరించలేదో అర్థం కాలేదు. భూమి రెండుగా బద్ధలై తను లోపలికి వెళ్లిపోతే బాగుండేది.

అందమైన తన పర్సనాలిటీ ఇలా మునిసిపాలిటీలా ఎందుకు మారిపోయిందో అవగతం కాలేదు.

అతను అలా శిలాప్రతిమలా నిలబడుండగానే వాళ్ళు ముందు కెళ్లిపోయారు. ఈలోగా రవి అతన్ని పట్టుకున్నాడు.

"ఏరా! నీ కిదేం పిచ్చిరా? లేచీ లేవగానే అలా పరుగెత్తావు?"

"అయిపోయింది రవీ! అంతా అయిపోయింది!"

"అవును సినిమా అయిపోయి చాలాసేపైంది."

"సినిమా కాదు నా జీవితం కూడా అయిపోయింది."

"అప్పుడే జీతం అయిపోయిందా, పోయిందా?" కంగారుగా అడిగాడు రవి.

"షటప్! వెధవ జీతం. ఎవడి క్కావాలి?"

"నాకిచ్చెయ్యి" ఆత్రంగా అడిగాడు.

"ఇస్తాను - నా ప్రేయసిని నాకిస్తావా?" సీరియస్‌గా అడిగాడు.

"తప్పకుండా - నా జేబులో ఉంటే తీసుకో" చెప్పాడు.

"ఒరే రవీ! నేను నీ కంటికి ఎలా కనిపిస్తున్నానురా?"

"వడలిపోయిన వంకాయలాగా."

"పరవాలేదు. బెటరే! ఆమె కంటికి ఆటో అబ్బిలా, రిక్షా వాడిలా కనిపించాను."

"ఆ ! కొంపదీసి కన్నె కన్నా!" ఆశ్చర్యంగా అడిగాడు."తెలియదు. కాళ్లవంక చూడలేదు."

"అదీ నువ్వు చేసిన పొరపాటు."

"అదేం?"

"ముందస్తుగా పరాయి ఆడదాన్ని పలకరించేప్పుడు ఆమె ఏ రకం చెప్పులేసుకుందో చూడాలి. అవి చేతిలోకి తీసుకోవడానికి ఆమెకు ఎంత టైము పడుతుందో అంచనా వేయాలి. ఆ టైము కంటే తక్కువ టైములో మన డైలాగ్ ముగించాలి. అర్థమైందా?" గీతోపదేశం చేశాడు రవి.

"నంద చెప్పు తీసుకు కొట్టినా ఆనందించేవాణ్ణి నన్ను గుర్తు పట్టకుండా వెళ్లిపోయింది" బాధగా చెప్పాడు.

"ఒరే ఒరే! అప్పుడే పేరు కూడా కనుక్కున్నావే?"

"కనుక్కోవడమేమిటి. ఆమె నా స్నేహితురాలు - నా బాల్య స్నేహితురాలు" చెప్పాడు బరువు గుండెతో.

నడుచుకుంటూ వస్తున్న మిత్రులకి ఆగిపోయిన రిక్షా కనిపించింది. రిక్షావాలా పడిపోయిన చైనును సరి చేయడానికి ప్రయత్నిస్తున్నాడు.

"వాళ్లే! ఆమె నంద!" టక్కున చెప్పాడు రవికి.

రవి ఇటువంటి విషయాల్లో చురుకైనవాడు. తన తక్షణ కర్తవ్యం ఏమిటో గ్రహించాడు.

"నందగారూ మీరు అన్యథా భావించకపోతే" అంటూ వెనక నుంచి మాటలు కలిపాడు.

ఆశ్చర్యంగా వెనక్కి తిరిగి చూసింది నంద. సుమతి కూడా చూసింది.

చీకట్లో ఎద్దుల్లాంటి కుర్రాళ్లు ఇద్దరు కనిపించారు వాళ్ల కంటికి. సుమతి కంగారు పడింది అల్లరి చేస్తారేమో రోడ్ సైడ్ రోమియోలనుకుని "ఏయ్ మిస్టర్! మా అన్న ఎవరో తెల్సా?" నంద ధైర్యంగా అడిగింది.

"ఎన్. టి. రామారావా?" రవి అడిగాడు.

"షటప్! ఈ ఊళ్లో ఎస్సై."

"అయితే సై" అంటూ పక్కకు పరుగెత్తాడు రవి.

రిక్షావాలా చైను వేసి పైకి లేచాడు.

"తప్పు బాబూ! సదువుకున్నోళ్లు ఇలా ఆడోళ్లంబడి పడటం తప్పు." రిక్షావాలా నీతి బోధించాడు విదురిడిలా.

"నందా! నన్ను గుర్తుపట్టలేదా?"

కదులుతున్న రిక్షా గట్టిగా పట్టుకుని అరిచాడు చిరంజీవి.

"రిక్షా పట్టు వదలకపోతే పళ్లు రాలగొడతా జాగ్రత్త!" సునంద కోపంగా అంది.

"నేను - చిరంజీవిని."

"నీ మొహం అందరూ చిరంజీవి సినిమాలు చూసి అంతటి వాళ్లు కావాలనుకుంటే అవుతారా? ఎప్పుడైనా అద్దంలో మొహం చూసుకున్నావా?" సుమతికి కొంచెం ధైర్యం వచ్చి దబాయించింది.

"టెన్త్‌లో నీకు లెక్కలు నేర్పిన చిరంజీవిని" బిక్కమొహం పెట్టుకుని అన్నాడు.

"ఓ గాడ్! ఆ జీవివా!" సునంద ఆనందంగా కేక పెట్టి అందంగా ఒకటి కొట్టింది అతని చేతిమీద.

"రేపు పెళ్లి చూపులు పెట్టుకుని అడ్డమైన వాళ్లతో మాట్లాడమేమిటి?" అక్క కోపంగా తన పెద్దరికాన్ని తెలిపింది.

"అక్కా! ఇతను నా స్నేహితుడే."

"సర్లే! రేపు ఇంటికి రమ్మను. అర్ధరాత్రి అ20కమ్మశివాల్లా రోడ్ను మీదేమిటి?"

"హలో! రేపు పొద్దున పదికి చిల్డ్రన్స్ పార్క్‌లో కలుసుకుందాం. టాటా" చెప్పింది సునంద కదిలిపోతున్న రిక్షాలోంచి.

రూము కెళ్ళేసరికి అర్జున్ వాళ్ళ కోసం ఎదురు చూస్తున్నాడు పెట్టె సర్దుకుని.

"వెళ్ళిపోతున్నాను మైడియర్ ఫ్రెండ్స్! చివరి సారి మీ నుంచి వీడ్కోలు తీసుకోవడానికి ఆగాను" అర్జున్ చెప్పాడు.

"ఇంత రాత్రిపూట ఎక్కడికి?" ఆశ్చర్యంగా అడిగాడు చిరంజీవి.

"చిరూ! నా ఆశయం తెలుసుగా? ఈ కుళ్ళిపోయిన వ్యవస్థను మార్చాలి. ప్రతిభకు విలువలేని ఈ దేశాన్ని మార్చాలి. శ్రమ శక్తికి గుర్తింపులేని ఈ సమాజాన్ని మేల్కొలపాలి. అందరికీ అన్నం పెట్టలేని ఈ అన్నపూర్ణను ఆరెయ్యాలి. సంఘంలో గౌరవంగా చెలామణీ అయ్యే దోపిడిదార్లను ఉతికెయ్యాలి. ఆర్థిక అసమానతలను తొలగించాలి. కులం పిచ్చిగాళ్లతో కుళ్లిపోయిన ఈ నాగరిక సమాజాన్ని తగలబెట్టాలి!" ఆవేశంతో ఊగిపోతూ ఉపన్యాసం దంచాడు.

"నువొక్కడివీ ఇంత అర్ధరాత్రి పోయి ఏం చెయ్యగలవు?" రవి శాంతంగా అడిగాడు.

"ఒక్కడు? అల్లూరి సీతారామరాజు ఒక్కడు కాదా? సుభాష్ చంద్రబోసు ఒక్కడు కాదా? భగత్‌సింగ్ ఒక్కడు కాదా?"

"వాళ్ళ వెనకాల అనుచరులున్నారు." రవి చెప్పాడు.

"నిజం ! వ్యక్తి శక్తిగా మారాలి. శక్తికి యుక్తి కావాలి. యుక్తికి వ్యక్తి కావాలి."

"అర్జున్! ఇంత చదువు చదివావు. గోల్డు మెడల్ తీసుకున్నావు. నీలో ఈ విప్లవ భావాలేమిట్రా - ఇవ్వాళ కాకపోతే రేపు ఉద్యోగం రాదుట్రా?" రవి ఓదార్చాడు.

" ఇక్కడ ఒక్క అర్జున్ ప్రశ్న కాదు. నాలాంటి వాళ్ళు ఈ దేశంలో ఎంత మందున్నారు. డిగ్రీలు-పీజీలు, పిహెచ్.డీ.లు చేసి అడుక్కోవడానికిక్కడ అర్హతలేక - ఎందరు ఆత్మహత్య చేసుకోవడంలేదు? ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ నిరుద్యోగ సమస్యకు - ఈ దారిద్ర్యరేఖ దిగువ ఉన్నవాళ్ళ సమస్యలకు పరిష్కారం చూపడం లేదు.

అందుకే అధికారం మేం హస్తగతం చేసుకుని ఈ దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తాం. మా వెంట వస్తారా?" వెనక్కి చూసి అడిగాడు అర్జున్.

"ఆ! అప్పటికి బతికి ఉంటే మీ వెంట వస్తాం" కళ్ళు తుడుచుకుంటూ చెప్పాడు రవి.

"ఒరే అర్జున్! రాడికల్స్‌లో చేరేముందు ఇంకొక్కమారు ఆలోచించరా! సాయుధ విప్లవాలు ఈ దేశంలో జయప్రదం కావురా. మళ్ళీ గాంధీ పుట్టి ఈ సంఘాన్ని మార్చాల్సిందే!" చిరంజీవి ప్రార్థించాడు.

"ఈ పిరికిమందు పొయ్యకు. ప్రపంచంలో ఎన్ని దేశాలు శక్తి ముందు తల వంచలేదు. ఇప్పటికి ఎంతటి అభివృద్ధిని సాధించలేదు! మీకు ధైర్యముంటే ఇప్పుడైనా నా వెంబడి రండి."

కాని రవికి, చిరంజీవికి ధైర్యం చాలలేదు.

ఆ రాత్రల్లా మిత్రుల మధ్య సమాలోచనలు - వీడ్కోళ్ళు మొత్తుకోళ్ళు - జరిగాయి.

తెలవారుతుండగా అర్జున్ అంతర్ధానమయ్యాడు.

కలత నిద్రలోంచి లేచి తయారైన చిరంజీవి టైం చూసుకున్నాడు. పదవుతున్నది. నంద రమ్మంది. కాని స్కూలుంది ఏం చెయ్యాలి?

తుమ్మితే ఊడే ముక్కు లాంటి ఉద్యోగం గురించి ఆలోచించకుండా సునందను కలుసుకోవడానికే నిశ్చయించుకున్నాడు చిరంజీవి చిరుదరహాసంతో.

అప్పటికే సునంద అతనికోసం ఎదురుచూస్తున్నది.

"ఏమిటి ఇంత ఆలస్యం? నే తొందరగా వెళ్లాలి. పెళ్లి చూపుల హడావిడి." చెప్పింది ఆమె.

"ఎవరికి?" తాపీగా అడిగాడు.

"మా ఎదురింటి పిన్నిగారికి" కోపంగా చెప్పింది.

"అయినా నేను నువ్వు గుర్తు పట్టలేనంతగా మారిపోయానా?"

"ఆడపిల్లలు మీకుమల్లే రోడ్లమీద దిక్కులు చూస్తూ ఉండరు గుర్తు పట్టడానికి."

"నామీద ఇంకా కోపం పోలేదా?"

"కోపమా? ఎందుకు?"

"నాన్నగారు బాగున్నారా?"

"పోయి - నాలుగు సంవత్సరాలైంది."

"మరి - నీ చదువు?"

"మానేశాను. అక్కయ్య దగ్గరుంటున్నాను. ఇంతకీ నువ్వు ఏం చేస్తున్నావు? ఆఫీసరా?"

సిగ్గుపడుతూ తను చేస్తున్న ఉద్యోగం గురించి చెప్పాడు.

"చిన్నప్పుడు నీపైన పెట్టుకున్న నమ్మకాలు వమ్ము అయ్యాయి."

"ఏం కాదు - నేను బాగానే చదివాను. ఫస్టున పాసయ్యాను. కాని ఈ దేశం, ఈ ప్రభుత్వం నా ప్రతిభను వాడుకోలేకపోతున్నాయి."

"ఈ దేశం నాకే మిచ్చింది అని ప్రశ్నించే ముందు - ఈ దేశానికి నేనేం ఇచ్చాను అని ఆలోచించుకోవాలి?" చెప్పింది.

"ఇవ్వడానికి నాకు ఛాన్సు ఇస్తేగా?" కోపంగా అన్నాడు.

ఇంతలో ఓ వ్యక్తి మిరపకాయ బజ్జీలను వేయించి - కోసి - ఉప్పుకారం జల్లి కాగితంలో కట్టి తెచ్చి ఇచ్చాడు.

"మా కొద్దు." కోపంగా అరిచాడు.

"తీసుకోండి - నేనే తెమ్మన్నాను - ఆయన మా బావగారు."

"సారీ ! గ్లాడ్ టూ మీట్ యూ - నా పేరు చిరంజీవి."

"ఓకే - పానకంలో పుడకలా నేనెందుకు మధ్య? వస్తాను." అతను సెలవు తీసుకుని వెళ్లిపోయాడు.

"మా బావే ఇక్కడే బజ్జీల వ్యాపారం చేస్తాడు" చెప్పింది.

"ఇవ్వాళ పెళ్లిచూపులా? అబ్బాయి బావుంటాడా?"

"బాగు గీగు ఎవరికి కావాలి? అతను చేసుకుంటానంటే - ఒప్పేసుకోవడమే." మొహం పక్కకు తిప్పుకుని చెప్పింది.

"నందా! నాకు మంచి ఉద్యోగం ఉంటే... నేను... నిన్ను...." ఆగిపోయాడు సందేహిస్తూ.

ఆమె అతనివంక తీక్షణంగా చూసింది.

"అవును నందా! ఇప్పుడు నా పొట్టనే పోషించుకోలేకపోతున్నాను. ఇంత విజ్ఞానం సంపాదించగలిగాను గాని, చిన్న మంచి ఉద్యోగం సంపాదించలేకపోయాను. నేను కూడా రాడికల్సులో చేరిపోతానేమో మా అర్జున్ లాగా" బాధగా చెప్పాడు.

"హు ! విజ్ఞానం ఉందని అహంకారంతో ఊగిపోతారే తప్ప - ఇంత ఇంగితజ్ఞానాన్ని

సంపాదించుకుంటే - ఇలా కష్టాలు పడరు. అసలు చదువుకు సంపాదనకు సంబంధం ఎందుకుండాలి?"

"అంటే - చదువుకున్నవాడు, ఉద్యోగం చెయ్యవద్దనా?"

"కాదు. ఉద్యోగం వస్తే లక్షణంగా చెయ్యవచ్చు. కాని రాలేదని గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోకుండా తనకు చేతనైన పని చెయ్యచ్చుగా - డిగ్నిటీ ఆఫ్ లేబర్ తెలుసుకోవాలి."

"హు ! నన్ను కూడా బజ్జీలు అమ్ముకోమంటావా? మీ బావలాగా - అతనంటే చదువుకోలేదు" నిరసనగా అన్నాడు.

"ఆయన గురించి నీకేం తెలుసు? మా బావకు మ్యాథమెటిక్స్‌లో డాక్టరేట్ ఉంది. కాని అతను నీలా గిరి గీసుకుని కూర్చోలేదు. భార్యా బిడ్డల్ని పోషించడానికి ఓ వ్యాపకం పెట్టుకున్నాడు."

ఆమె మాటలు అతనికి షాక్ ఇచ్చాయి. అతని కళ్ళ ముందున్న పొరలు కరిగిపోతున్నాయి.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక (18.10.89)

